క్లుప్తంగా

ఇంటింటికీ ఓటరు స్లిప్‌ల పంపిణీ



పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. సోమవారం పాన్‌గల్, కొత్తపేట, దావాత్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ స్లిప్‌లను ఓటర్లకు అందజేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని వారు సూచించారు. ఓటర్ స్లిప్‌లు తప్పక ప్రతి ఓటరుకు అందించాలని తహసీల్దార్ సుభాష్‌నాయుడు బూత్‌లెవల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మహేష్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు



గోపాల్‌పేట: కిరాణషాపుల్లో మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఏదులకు చెందిన బార్ల బాల్‌రాజు ఇంటి వద్ద 25.3 లీటర్లు, అదే గ్రామానికి చెందిన బార్ల శేఖర్ ఇంటి వద్ద ఏడు లీటర్ల మద్యం, పాటిగడ్డతండాలో హన్మంతు ఇంటి వద్ద 32 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మొత్తం 63 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోగా.. దీని విలువ రూ.22,071 ఉంటుందని ఆయన వెల్లడించారు.

బండలాగుడు పోటీలు



ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలో శ్రీలక్ష్మీనరసింహ యోగానంద 125వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా సోమవారం బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఐదు జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం యాదిరెడ్డిపల్లికి చెందిన అఖిలేష్‌రెడ్డి వృషభాలు బండను 3,246.8 ఫీట్లు లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. గద్వాలకు చెందిన గోసాయి వినీల్ రాయుడు వృషభాలు 2,481.10 ఫీట్లు లాగి ద్వితీయ, చిన్నంబాయి మండలం పెద్దదగడకు చెందిన గోపాలకృష్ణకు చెందిన వృషభాలు 2,421.11 ఫీట్లతో తృతీయ, మానవపాడుకు చెందిన రవీందర్‌రెడ్డికి చెందిన వృషభాలు 2,202.4 ఫీట్లు లాగి నాల్గో స్థానం, గోపాల్‌పేటకు చెందిన విఘ్నేశ్వరి వృషభాలు 621.2 ఫీట్లు లాగి 5వ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన వృషభాలకు ప్రథమ బహుమతిగా రూ.60 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.40 వేలు, తృతీయ బహుమతిగా రూ.30 వేలు, నాల్గో బహుమతిగా రూ.20 వేలు, ఐదో బహుమతిగా రూ.15 వేల నగదును దేవాలయ కమిటీవారు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, వెంకటేశ్వర్‌రావు, బాలకృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, సతీష్‌కుమార్, జన్ను మధు, రామకృష్ణారెడ్డి, క్యామ రాజు, బీజేపీ నాయకులు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మురళి తెలిపారు. మండలంలోని గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరంలో పాల్గొని కంటి శుక్లాలను పరీక్షించుకోవాలని ఆయన కోరారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయురాలు మృతి

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన శోభారాణి(55) ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురై ఆదివారం రాత్రి మృతి చెందింది. ఆమె కర్నూల్ నివాసం ఉంటున్నారు. మండలంలోని కలుకుంట్ల యూపీఎస్ పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో పెద్దపోతులపాడు, తదితర పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా, మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డులు తీసుకున్నారు. సమయపాలన, క్రమశిక్షణ, విద్యార్థులకు ఉత్తమంగా విద్యను బోధించేవారని సోమవారం ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. ఆమెకు భర్త రవికుమార్‌రెడ్డి, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆమె మృతిపట్ల కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కన్నీరుమున్నీరయ్యారు.

యథేచ్ఛగా ఒండ్రుమట్టి తరలింపు

- ఇటుకబట్టీకి వ్యాపారుల ఇష్టారాజ్యం
- నాలుగు రోజులుగా ఆరు పెద్ద టిప్పర్లతో..
- అధికారుల అండదండలతోనే తరలిస్తున్నట్లు స్థానికుల ఆరోపణ



ఒండ్రుమట్టిని తరలిస్తున్న టిప్పర్



గోపాల్‌పేట కత్వచెరువులో ఒండ్రుమట్టిని టిప్పర్లలో నింపుతున్న జేసీబీ

గోపాల్‌పేట: రైతులు తమ పొలాలను సారవంతం చేసుకునేందుకు చెరువుల్లోని ఒండ్రుమట్టిని తరలించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ప్రైవేట్ వ్యక్తులు తీసుకువెళ్లాలంటే రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ ఇవేవీ పట్టకుండా నాలుగు రోజులుగా గోపాల్‌పేట మండల కేంద్రంలోని కత్వ చెరువు నుంచి వ్యాపారులు అక్రమంగా ఒండ్రుమట్టిని వారి ఇటుకబట్టీలకు పెద్ద లారీలతో వందల ట్రిప్పులు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. శుక్రవారం, శనివారం, ఆదివారం, సోమవారం మొత్తం నాలుగు రోజుల పాటు కత్వ చెరువు నుంచి ఒండ్రుమట్టిని తీసి గోపాల్‌పేట నుంచి వనపర్తి రోడ్డులో ఉన్న పీఏసీసీ ఎదుట ఇటుకబట్టీ వద్ద నిల్వ చేస్తున్నారు. ఇదే విషయం గోపాల్‌పేట తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా.. తమకు ఎలాంటి సమాచారం లేదని, మట్టి తరలింపునకు ఎవరికీ అనుమతులు మంజూరు చేయలేదని సమాధానం ఇచ్చారు. ఘటనపై విచారణ జరిపి అక్రమంగా ఒండ్రుమట్టిని తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయిస్తామని చెప్పారు. అధికారులు చెప్పిన తర్వాత కూడా టిప్పర్లతో ఒండ్రుమట్టిని తరలింపు జోరుగా కొనసాగుతుండడంతో అధికారులకు ముడుపులు అందాయని, అందువల్లనే చూసిచూడనట్లు వదిలేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

అనుమతి లేకుండా చెరువుల్లో నుంచి ఒండ్రుమట్టిని తరలించడం నేరం. గోపాల్‌పేట కత్వ చెరువు నుంచి ఒండ్రుమట్టిని తరలిస్తున్నారని సమాచారం అందింది. తమ సిబ్బందిని పంపించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తాం. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం.

– వెంకటరమణమ్మ, డీఈ, నీటిపారుదల శాఖ

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

పాన్‌గల్: ఎండలు తీవ్రంగా ఉండటంతో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలతో పాటు హరితహారంలో నాటిన మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకుంటూ రోజువారీగా వాటర్ క్యూరింగ్ చేయాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని దొండాయిపల్లి, రాయినిపల్లి గ్రామాల్లో పర్యటించి నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి వాటర్ క్యూరింగ్‌తో పాటు మొక్కలకు ఎండ నుంచి రక్షణగా నీడ షెడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జీపీలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలని ఆదేశించారు.

ఉపాధి పనుల పరిశీలన

మండలంలోని దొండాయిపల్లి చెరువులో ఒండ్రుమట్టి తరలింపు పనులను ఏపీఓ కుర్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే సాగునీటి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి జీపీలో రోజువారీ కూలీలు 200కు తగ్గకుండా పనులకు వచ్చేలా చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఎండల తీవ్రంగా ఉండటంతో కూలీలు అన్ని జాగ్రత్తలు పాటించాలని, పనుల వద్ద నీడ, నీటి వసతి తప్పక ఉండాలన్నారు. వసతుల విషయంలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

‘సతి’ గెలుపునకు ‘పతి’ ప్రచారం

అమరచింత: మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపునకు ఆమె భర్త మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి మక్తల్ నియోజకవర్గంలోని నర్వ, ఆత్మకూర్, అమరచింత మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. తెలిసిన రాజకీయ నాయకులు, యువతను కలిసి కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అలాగే బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌పార్టీలకు చెందిన పలువురిని కలిసి బీజేపీలో రావాలని ఆహ్వానించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.



కిష్టంపల్లిలో ప్రచారం చేస్తున్న భరతసింహారెడ్డి

నరేంద్రమోదీ సారథ్యంలో సుస్థిర పాలన



కిష్టంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



జిల్లాకేంద్రంలోని కుమ్మరి వాడలో..

పెబ్బేరు రూరల్: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో సమర్థవంతమైన పాలన అందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ మద్దతుగా సోమవారం వనపర్తి పట్టణ బీజేపీ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో వనపర్తిలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ.. భరత్‌ప్రసాద్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు చేస్తామని చెప్పి చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి శ్రీశైలం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, పట్టణ బీజేవైఎం అధ్యక్షుడు ఎద్దుల రాజు, సుమిత్రమ్మ, ఎద్దుల రవి, రాయన్నసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రంగాపురంలో..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ గెలుపు కోసం పెబ్బేరు మండలంలోని రంగాపురంలో సోమవారం మండల మాజీ అధ్యక్షుడు భగవంతుయాదవ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, ఈశ్వర్‌సాయి, ఈశ్వర్, హరీష్, వెంకటేష్, శివసాయి, శంకరయ్య, లోకేష్, గురుప్రసాద్, మహేష్, ప్రవీణ్, భాస్కర్, చందు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు ఓటే వేసి గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు మండలంలోని కిష్టంపల్లి, నందిమళ్ల ఎక్స్‌రోడ్, ఈర్లదిన్నె, మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజుతో పాటు స్థానిక బీజేపీ నాయకులు ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నరాల నారాయణ, వెంకటేశ్వర్లు, మరాఠి అశోక్, భీంరెడ్డి, క్యామ భాస్కర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గోపాల్‌పేట: మండలంలోని నర్సింగాయపల్లికి చెందిన కుమ్మరి నాగన్నకు చెందిన ఏడు ట్రాక్టర్ల గడ్డివాము ఈనెల 27న కాలి బూడిదైంది. సోమవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి రైతు ఇంటికి వెళ్లి పరామర్శించారు. మేఘారెడ్డి తక్షణ ఆర్థికసాయంగా కొంత నగదును అందించారు. అధికారులతో మాట్లాడి వారికి అందాల్సిన సాయాన్ని అందిస్తామని రైతుకు అండగా ఉంటామని చిన్నారెడ్డి భరోసా కల్పించారు.

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 9వ వార్డు మర్రికుంటకు చెందిన చీర్ల ఆంజనేయులు గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సోమవారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారెడ్డి వెంట మాజీ ఉపసర్పంచ్ చీర్ల జనార్దన్, చంద్రాయుడు, చీర్ల రాములు, మన్యం కొండ, మహేష్, గుంటి రాజు ఉన్నారు.

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లికి చెందిన మైలారం బాలయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. సోమవారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సూచన మేరకు బీఆర్‌ఎస్ నాయకులు రూ.10 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, మౌలాలి, కురుమయ్య, రాజవర్ధన్‌రెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



నర్సింగాయపల్లిలో బూడిదైన వరిగడ్డిని పరిశీలిస్తున్న చిన్నారెడ్డి



సంగినేనిపల్లిలో..

అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను నమ్మొద్దు



అమడబాకులలో ఇంటింటి ప్రచారం చేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక

కొత్తకోట రూరల్: అబద్ధాలు చెప్పి మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దని జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని అమడబాకులలో ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గడిచిన 10ఏళ్ల కాలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు ఇవ్వడంతో పాటు పల్లె ప్రకృతి వనం, రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమైందన్నారు. సాధ్యం కానీ హామీలు ఇచ్చి గద్దె నెక్కిన కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజలకు మోసం చేసేందుకు వచ్చిందని, కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేస్తే డ్రైనేజీలో వేసినట్టేనన్నారు. మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో రాములుయాదవ్, కొండారెడ్డి, ఆకుల శ్రీనివాసులు, గాడీల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో సోమవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

భారతి సిమెంట్‌తోనే దృఢమైన నిర్మాణాలు



బిజినేపల్లి: భవన నిర్మాణ రంగంలో నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంటు పెట్టింది పేరని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సునీల్ అన్నారు. తిమ్మాజిపేట మండలంలోని వినాయక ట్రేడర్స్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌ల కన్నా భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌పై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. వినియోగదారులకు స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ సహకారాలు, సూచనలు ఇస్తారని వివరించారు. యాదాద్రి దేవాలయ నిర్మాణానికి, ఆలేరు వరంగల్ జాతీయ రహదారి, బాలానగర్‌పై ఫ్లైఓవర్ నిర్మాణానికి భారతి సిమెంట్‌ను వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం 60 మంది మేస్త్రీలకు ఉచితంగా రూ.లక్ష ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ విజయ్ బాబు, టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్, వినాయక ట్రేడర్స్ డీలర్ నితీన్, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో అభివృద్ధి అంతంతే..

వనపర్తి టౌన్: రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితే దేశంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్‌అక్తర్ అన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని సోమవారం మిర్యాలగూడలోని జాన్‌పాడు దర్గాలో వనపర్తి పట్టణానికి చెందిన మైనార్టీ నాయకులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం అపహస్యం పాలైందని దుయ్యబట్టారు. బీజేపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు ఒరిగిందేమీ లేదన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి మల్లు రవి అధిక మెజార్టీతో గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడానికి ఇక్కడి నుంచే బీజం వేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనీస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

కొత్తకోట రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్యారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అమడబాకులలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డిని గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడిచిన 10ఏళ్ల బీజేపీ పాలనలో సామన్యుడు బతుకలేని పరిస్థితి వచ్చాడని, కార్పొరేట్ కంపెనీలకు కాంట్రాక్టులను అప్పగించేందుకు లేబర్ కోడ్‌ను తీసుకొచ్చిందని మండిపడ్డారు. కార్యక్రమంలో శరత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బీచుపల్లియాదవ్, రంగారెడ్డి, కొల్లంపల్లియాదవ్, మోహన్‌గౌడ్, వెంకటయ్య, లక్ష్మణ్, కావలి తిరుపతయ్య ఉన్నారు.



అమడబాకులలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేడు ఎమ్మెల్యే ప్రచారం

అమరచింత: మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్ల వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఉదయం ఏడు గంటలకు నాగల్‌కడ్మూర్ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లి, కొంకన్‌వానిపల్లి, మస్తీపురం, సింగంపేట, చంద్రగఢ్, నందిమళ్ల, కిష్టంపల్లి, నందిమళ్ల ఎక్స్‌రోడ్, ఈర్లదిన్నె, మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటా ప్రచారం కొనసాగుతుందన్నారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

టీజేఎస్ ఆవిర్భావ వేడుకలు

వనపర్తి టౌన్: తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడగలిగే ఏకైక పార్టీ తెలంగాణ జన సమితి పార్టీ అని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాదర్‌పాషా అన్నారు. తెలంగాణ జన సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్, జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రజాభివృద్ధి, సంక్షేమం కాకుండా డబ్బులపై దృష్టి సారిస్తున్న నేటి రాజకీయాల్లో తెలంగాణ జన సమితి డబ్బుకు కాకుండా ప్రజలతో మమేకమవుతూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేందుకు ఎన్నో పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై అవిశ్రాంత పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌కుమార్, నాయకులు బాలయ్య, వినోద్ కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఎంఏ ఖాదర్ పాషా

నిలిచిన రహదారి నిర్మాణం

- ఏడాది క్రితమే శంకుస్థాపన
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి



కంకర వేసి వదిలేసిన రోడ్డు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రం నుంచి నాగసానిపల్లి వరకు 5 కిమీ బీటీ రహదారి నిర్మాణానికి ఏడాది క్రితం మొదటి విడతలో రూ.3.20 కోట్లు, రెండో విడతగా రూ.1.30కోట్లు మంజూరయ్యాయి. మొదటి విడత నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు. మట్టి పనులు, కల్వర్టులు, బిడ్జిల నిర్మాణం కొంతభాగం వైట్ మిక్చర్ వేసి, మరికొంత భాగం మట్టి వేసి వదిలివేశారు. అంతలోనే బీటీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. నిధులు మంజూరైన వెంటనే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంతో మండల కేంద్రానికి వెళ్లడానికి బీటీ రోడ్డు అందుబాటులోకి వస్తుందని ఆశ పడిన ప్రజలకు నిరాశే మిగిలింది.

మట్టి, కంకరతో సరి

2019లో అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి రూ.3.20 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. రహదారి వెంబడి 2 కిలో మీటర్ల మేర కంకర పరిచారు. 3 కిలో మీటర్ల వరకు మట్టి వేసి, కంకర వేయలేదు. కల్వర్టు నిర్మాణం పూర్తి చేసినా.. బ్రిడ్జి పనులు అటకెక్కాయి. అప్పట్లో ఆయకట్టు రైతులు వ్యతిరేకించడం, నిధులు సరిపోలేదనే నెపంతో కాంట్రాక్టర్ పనులు స్వస్తి చెప్పారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇబ్బందులు తొలగించాలి

గతంలో మండల కేంద్రానికి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులకు గురయ్యాం. గ్రామ సమీపంలో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ మట్టికొట్టుకు పోవడంతో బ్రిడ్జి పూర్తయినా ఇబ్బందులు తప్పడంలేదు. బీటీ వేయక పోవడంతో మండల కేంద్రానికి వెళ్లడానికి చుట్టూ తిరిగి పోవాల్సి వస్తుంది. త్వరగా పనులు పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలి.

– నరేష్, నాగసానిపల్లి

త్వరగా పూర్తి చేస్తాం

కాంట్రాక్టర్‌తో మాట్లాడి మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తాం.

– రమేష్‌నాయుడు, పీఆర్ ఏఈ, శ్రీరంగాపురం

కూటి కోసం..

అమరచింత: పొట్టకూటి కోసం కోటి విద్యలు అంటుంటారు. కానీ ఊరురా సర్కస్ ప్రదర్శన ఇస్తూ ప్రాణాలను పణంగా పెట్టి పొట్ట నింపుకుంటున్న ఘటనలు అక్కడక్కడ చూస్తుంటాం. హైదరాబాద్‌కు చెందిన సర్కస్ రవి కుటుంబ సభ్యులు అమరచింత పట్టణంలో సోమవారం అలాంటి విన్యాసాలతో ప్రజలను అలరించారు. తాడుపై కర్ర సాయంతో యువతి నడవడం, ఇనుప చువ్వను గొంతుతో వంచడం వంటి విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి.



కర్ర సాయంతో తాడుపై నడుస్తున్న మహిళ